ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
ఆదివారం 27 అక్టోబరు 2024





వావ్.. గోల్ గుమ్మజ్..!

- విస్తీర్ణంలో అతి పెద్ద గుమ్మజ్‌గా ఖ్యాతి
- నాలుగు శతాబ్దాల పురాతన కట్టడం
- నగరంలో పర్యాటకులను ఆకర్షిస్తోన్న గోల్ గుమ్మజ్

ఆ పక్కన హంద్రీ నది. దాని ఒడ్డునే అందాల గుమ్మజ్. కర్నూలు వాసులకు ఇదొక అద్భుత ప్రదేశం. ఈ గోల్ గుమ్మజ్‌ను చూసి ఎవరైనా పులకరించి పోవాల్సిందే. నవాబుల నాటి రాచరీవిని ఒలుకబోస్తూ అత్యంత సుందరంగా కనిపించే గుమ్మజ్ వద్ద కూర్చుని సేదతీరేవారెందరో. కానీ నేడు హంద్రీ జలకళ లేకున్నా నాటి రాచరిక దర్పానికి నిదర్శనంగా ఈ చారిత్రక కట్టడం చెరగని ప్రాభవాన్ని చాటుకుంటోంది. భారతదేశంలో కెల్లా అతిపెద్ద గోల్ గుమ్మజ్‌గా పేరొందిన ఈ కట్టడం ఆగ్రాలోని తాజ్‌మహల్, బీజాపూర్‌లోని గోల్ గుమ్మజ్‌ల కన్నా నిర్మాణ వైశాల్యంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. కర్నూలు చార్రితక ప్రాధాన్యతలో ఇది భాగం.

వివరాలు 6 లో..

ఏపీ ప్రభుత్వం X తుంగభద్ర బోర్డు



తుంగభద్ర దిగువ కాలువకు చేసిన ఆర్‌సీసీ లైనింగ్ (ఫైల్)

కర్నూలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వానికి, తుంగభద్ర బోర్డుకు మధ్య వివాదం తలెత్తింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర కాలువల ఆర్‌సీసీ లైనింగ్ కోసం పిలిచిన టెండర్లలో నిబంధనలను పాటించలేదని, ఆనాటి వైసీపీ నాయకులు అవినీతికి పాల్పడి చీకటి ఒప్పందాలు చేసుకున్నారనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం ఆ పనులను రద్దు చేస్తూ సెప్టెంబర్ 29న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ టెండర్లు రద్దు చేయాల్సిన అవసరం లేదని బోర్డు అధికారులు పేర్కొన్నారు. పైగా ఏపీ ప్రభుత్వ ఆదేశాలు తమకు వర్తించవని తుంగభద్ర బోర్డు అధికారులు అంటున్నారు. ఈ వివాదం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

- గత టెండర్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్
- ఆ ఉత్తర్వులు వర్తించవంటున్న టీబీపీ బోర్డు
- వైసీపీ హయాంలో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ లైనింగ్ కోసం రూ.400 కోట్లతో టెండర్లు
- ఇప్పటికీ పనులు మొదలు పెట్టని టీబీపీ బోర్డు ఇంజనీర్లు
- గత టెండర్లు రద్దు చేయాలంటూ సీఎంకు, బోర్డుకు ఓ కాంట్రాక్టరు ఫిర్యాదు

తుంగభద్ర కాలువలకు ఆర్‌సీసీ లైనింగ్ కోసం దాదాపు రూ.400 కోట్లతో గత ప్రభుత్వం టెండర్లకు పిలిచింది. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన అప్పటి ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు బళ్లారిలో మకాం వేసి కాంట్రాక్టర్లకు పనులు పంపకాలు చేశారు. తెర వెనుక చక్రం తిప్పిన ఆ ఎమ్మెల్యేలకు 5 శాతం వాటా ఇచ్చేలా చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు వివిధ కారణాల వల్ల పనులు మొదలు పెట్టలేదు. ఆ తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం.. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పూర్తి చేసి మొదలు పెట్టని పనులను, 25 శాతంలోపు పురోగతిలో ఉన్న పనులను రద్దు చేయాలంటూ సెప్టెంబరు 29న ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు బోర్డుకు వర్తించవని, ఆ టెండర్లు రద్దు చేయాల్సిన అవసరం లేదని బోర్డు అధికారులు అనడం వివాదాస్పదంగా మారింది.

తుంగభద్ర జలాశయం నుంచి కర్నూలు జిల్లాలో సాగు, తాగునీరు అందించేందుకు 24 టీఎంసీలు వాటా కలిగిన టీబీపీ ఎల్లెల్సీ కాలువ 0/0 కి.మీల నుంచి కర్నూలు జిల్లా ఆదోని మండలం హానవాల్ గ్రామం దగ్గర 250.850 కి.మీల వరకు, అనంతపురం జిల్లాలో సాగు, తాగునీరు అందించేందుకు 31.50 టీఎంసీలు నికర జలాలు వాటా ఉన్న టీబీపీ హెచ్చెల్సీ కాలువ 0/0 నుంచి అనంతపురం జిల్లా బొమ్మనహాల్ సమీపంలో 105 కిలో మీటర్ల వరకు తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉంది. 1955లో తుంగభద్ర కాలువలు నిర్మించడం వల్ల కాల్వ గట్టు పలు ప్రాంతాల్లో బలహీనంగా మారింది. పూడిక నిండిపోయింది. దీనికి తోడు ఎగువన కర్ణాటక జలచౌర్యం వల్ల వాటా జలాలు అందడం లేదు. తుంగభద్ర డ్యాంలో చేరే వరదను టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా ఎల్లెల్సీ కాల్వకు సగటున 16-18 టీఎంసీలు కేటాయిస్తారు. పూర్తి వాటా నీటిని తీసుకోవాలంటే ఎల్లెల్సీ ఆధునికీకరణలో భాగంగా కర్నూలు జిల్లా పరిధిలో 115.275 కి.మీల నుంచి 205.45 కి.మీల వరకు రూ.448 కోట్లతో చేపట్టే 9 ప్యాకేజీలకు 2022 ఫిబ్రవరి 26న టీబీపీ బోర్డు సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్‌ఈ) అడ్మినిస్ట్రేషన్ అప్రూవల్ ఇచ్చారు. అదే ఏడాది మార్చి 4న టెండరు ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. దాదాపుగా ఈ పనులు పూర్తయ్యాయి. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారుగా రూ.319 కోట్లు వరకు బిల్లులు బకాయి ఉన్నాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

మిగతా 6 లో..

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు లీగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్య లపై చర్చించేందుకు జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శని వారం అవగాహన కార్యక్ర మం నిర్వహిం చారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎల్. సాంబశివ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ఎస్. జుబేదాబేగం, పలువురు ఎన్జీవో సభ్యు లతో ఆయన మాట్లాడుతూ బాల కార్మికు లను గుర్తిం చి వారికి వెంటనే పునరావాసం కల్పించాలని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఈ నెల 21 నుంచి నవంబరు 20వ తేదీ వరకు పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీసు ఆయుధాల ప్రదర్శన

ప్రారంభించిన ఎస్పీ బిందుమాధవ్



ప్రారంభిస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసు ఆయుధాల ప్రదర్శన (ఓపెన్ హౌస్) కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి. బిందుమాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలో పలు విద్యాసంస్థల విద్యార్థులతో ఎస్పీ ముచ్చటిస్తూ పోలీసు విధుల్లో వినియోగించే ఆయుధాల పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా రెండు రోజుల పాటు ఆయుధాల ప్రదర్శన ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంట వరకు ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. ఏ సందర్భంలో ఏ ఆయుధాన్ని వినియోగించేదీ విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, నారాయణ, జావేద్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, నగరంలోని పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లితో ఊరికి తిరిగి వచ్చిన రైతు

- సర్వర్ సమస్యలతో ఆగిపోయిన కొనుగోళ్లు
- గ్రామంలో ఉల్లిగడ్డలు ఆరబోసుకున్న రైతులు

గోనెగండ్ల, అక్టోబరు 26: గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశతో కర్నూలు ఉల్లి మార్కెట్ కు వెళ్లిన రైతులను సర్వర్ కష్టాలు వెంటాడుతున్నాయి. గోనెగండ్ల నుంచి గురువారం సాయంత్రం ఉల్లి పంటను ట్రాక్టర్‌లో వేసుకొని రైతులు కర్నూలు మార్కెట్‌కు వెళ్లారు. అయితే అక్కడ శుక్రవారం ఆన్‌లైన్ విక్రయాలు జరగడం లేదని మరో మూడు రోజుల పాటు విక్రయాలు జరగవని తెలిసింది. ఉల్లితో నిండిన వాహనాలను మార్కెట్‌లోకి తీసుకువెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో చేసేది లేక గోనెగండ్ల రైతులు వెళ్లిన వాహనాల్లోనే ఉల్లి పంటను తిరిగి స్వంత గ్రామాలకు తీసుకువచ్చారు. తమ ఇండ్ల పరిసరాల్లో ఆరపోసుకున్నారు. అయితే వర్షం వస్తే ఉల్లిగడ్డలు తడిసిపోతాయని ఆందోళన చెందుతున్నారు.

కర్నూలుకు వెళ్లి ఇంటికి వచ్చేశాను



గురువారం కర్నూలు మార్కెట్‌కు తరలిస్తే అక్కడ ఆన్‌లైన్ విక్రయాలు జరగడం లేదని తెలిసింది. మరో మూడు రోజులు నమ్మకం లేదన్నారు. సర్వర్ ప్రాబ్లం ఉందన్నారు. ఉల్లిగడ్డలతో తిరిగి వచ్చేశాను. ట్రాక్టర్ బాడుగ అదనంగా పడింది.

-ఎక్‌బాల్‌బాషా, ఉల్లి రైతు, గోనెగండ్ల



ఆరు బయట ఉల్లిని ఆరబెట్టుకున్న కబూల్ బాషా

ఉల్లి రైతు సమస్యలపై అధికారుల ఆరా



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుల బాధలు ప్రభుత్వానికి చేరాయి. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి విజిలెన్స్ జేడీ రాజశేఖర్, కడప జేడీ రామాంజనేయులు ప్రభుత్వ ఆదేశాలపై గుంటూరు నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు శనివారం తరలి వచ్చారు. కర్నూలు జేసీ డా.బి. నవ్య హుటాహుటిన మార్కెట్‌యార్డుకు చేరుకుని ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. రైతులతో మాట్లాడారు. మూడు రోజు లుగా యార్డులో పేరుకు పోయిన ఉల్లి నిల్వలను పరిశీలించారు. యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మితో మాట్లాడి విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులతో జేసీ మాట్లాడుతూ ప్రభుత్వంతో మాట్లాడి సర్వర్ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. అనం తరం సెక్రటరీ చాంబరులో విజిలెన్స్ జేడీ రాజశేఖర్, కడప జేడీ రామాంజనేయులు, యార్డు సెక్రటరీ జయ లక్ష్మి, అదనపు సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో ఉల్లి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఉల్లి నిల్వలు ఇకపై ఇట్లా పేరుకు పోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. యార్డులో ఇబ్బందులు ఉంటే.. వెంటనే రైతులకు సమాచారం చేరవేసి నిర్దీత మొత్తంలోనే ఉల్లిని యార్డుకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈనామ్ సర్వర్‌ను వెంటనే సరి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు సెక్రటరీలు రెహమాన్, వెంకటేశ్వర్లు, గ్రేడ్2 సెక్రటరీ కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలందరూ సభ్యత్వం తీసుకోవాలి

- మంత్రి, ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడి పిలుపు



టీడీపీ కార్యాలయంలో సభ్యత నమోదు కార్యక్రమంలో మంత్రి, ఎంపీ, జిల్లా అధ్యక్షుడు, నాయకులు


కర్నూలు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలందరూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలని మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సూచించారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మొదటి సభ్యత్వం మంత్రి, ఎంపీలు కలిసి నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ చేత రూ. లక్ష రూపాయల శాశ్వత సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని, పార్టీలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. కేవలం రూ. 100తో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమాతో పాటు విద్యా ఉద్యోగం, వైద్య సహాయం అందుతుందని తెలిపారు. సభ్యత్వం ద్వారా సేకరించిన డబ్బును ఆన్‌లైన్ ద్వారా సేకరించి పార్టీ కోసం శ్రమించి ప్రాణాలు కోల్పోయిన 16,712 మంది పిల్లల కోసం ఖర్చు చేస్తారని తెలిపారు. పార్టీ నిర్వహించే విద్యాసంస్థలు, హాస్పిటల్స్ పార్టీ సేవా కార్యక్రమాలకు కూడా ఉపయోగిస్తారని తెలిపారు. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో అత్యధికంగా పార్టీ సభ్యత్వం నమోదు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల నాగేంద్ర, ఆకెపోగు ప్రభాకర్, టూరిజం శాఖ డైరెక్టర్ ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, ధరూర్ జేమ్స్, హనుమంతరాయ చౌదరి పాల్గొన్నారు.

హెరిటేజ్


చారిత్రక కట్టడం
చెరగని ప్రాభవం

- విస్తీర్ణంలో అతి పెద్ద గుమ్మజ్‌గా ఖ్యాతి
- నాలుగు శతాబ్దాల పురాతన కట్టడం
- నగరంలో పర్యాటకులను ఆకర్షిస్తోన్న గోల్ గుమ్మజ్





కర్నూలు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో హంద్రీ నది ఒడ్డున, ఉస్మానియా కళాశాల పక్కన గల గోల్ గుమ్మజ్ అందర్నీ అబ్బుర పరుస్తుంది. దీన్ని నిర్మించి 400 ఏళ్ల సంవత్సరాలు కావస్తున్నా గుమ్మజ్ చెక్కు చెదరని కట్టడంగా నిలిచి ఉంది. రాయికి మధ్య రాయి అమర్చి అతిపెద్ద గుమ్మజ్‌ను నిర్మించడంలో ఆనాటి ఇంజనీర్ల నైపుణ్యతకు అద్దం పడుతోంది. ఈ గుమ్మజ్‌ను ఆనాటి ఢిల్లీ మొగల్ చక్రవర్తి ఔరంగజేబు పాలనలో నిర్మించారని చరిత్ర చెబుతోంది. 1565లో విజయనగర సామ్రాజ్యాన్ని నవాబులు జయించాక ఈ ప్రాంతం వారి పాలన కిందకు వెళ్లిపోయింది. అలా కర్నూలు, ఆదోని, నంద్యాల ప్రాంతాలు బీజాపూర్ సుల్తానుల చేతికి వెళ్లాయి. 1573లో బీజాపూర్ సుల్తాన్ ఆదోని ప్రాంతాన్ని జయించాడు. 16వ శతాబ్దంలో బీజాపూర్ సుల్తానులు అబ్దుల్ వహాబ్ ఖాన్‌ను కర్నూలు ప్రాంతాన్ని ఆక్రమించుకోవడానికి కర్నూలుకు పంపించారు. ఆ సమయంలో కర్నూలు కోటను శ్రీరంగరాయలు కుమారుడైన గోపాలరాజు పరిపాలిస్తూ ఉండేవాడు. అబ్దుల్ వహాబ్ తన సైన్యాన్ని రహస్యంగా తుంగభద్ర నదికి అవతల ఉన్న గొందిపర్ల కొండల చాటుకు చేర్చాడు. చీకటిలో శత్రుసైన్యం చేరుకున్న విషయం కర్నూలు సైనికులు పసిగట్టలేకపోయారు. ఉదయం ఒక్కసారిగా అబ్దుల్ వహాబ్ తన సైన్యంతో కర్నూలు కోటపై దండెత్తి వచ్చాడు. దీనివల్లే 'కర్నూలుకు గొందిపర్ల చేటు' అనే నానుడి కూడా ఇక్కడ పుట్టింది. యుద్ధానికి సిద్ధంగా లేని సైన్యం చెల్లా చెదరు కాగా, కర్నూలు కోటను విడిచి గోపాలరాజు తుంగభద్ర నదిని దాటుకొని కోట ఉత్తర ద్వారం ద్వారా పారిపోయాడు. ఆయన యుద్ధంలో మరణించాడా, లేదా ఎక్కడికైనా వెళ్లిపోయాడా అనే అంశానికి ఆధారాలు దొరకలేదు. అయితే రోజూ గోపాల్‌రాజు ఒక ద్వారం ద్వారా తుంగభద్రకు స్నానానికి వెళ్లేవారని, అందువల్ల దానికి 'గోపాల్ దర్వాజా' అనే పేరు నేటికీ స్థిరపడి పోయింది.



గురువుకు దక్షిణగా గుమ్మజ్ నిర్మాణం

అబ్దుల్ వహాబ్ కర్నూలు కోటను జయించాక దాని చుట్టుపక్కల ఉన్న బేతంచర్ల, నంద్యాల, శిరువెళ్ల, కోవెలకుంట్ల ప్రాంతాలన్నీ జయించాడు. దీంతో ఈ ప్రాంతం బీజాపూర్ సుల్తానుల పాలనలోకి వెళ్లిపోయింది. అబ్దుల్ వహాబ్ 1602 నుంచి 1618 వరకు పాలించినట్లు చరిత్ర ఆధారాలు ఉన్నాయి. ఈ సమయంలోనే ఆయన కర్నూలు పెద్ద బజార్‌లో వరుసగా కమాన్‌లతో కూడిన అంగళ్లు కట్టించి, రాజవీధిని ఆకర్షణీయంగా తయారు చేశాడు. ఈయన తన గురువు అయిన సయ్యద్ కరీముల్లా ఖాద్రీ తాను మరణించాక తనను సమాధి చేయడానికి ఒక గుమ్మజ్‌ను నిర్మించమని కోరగా, ఆయన కోరిక మేరకు ఈ గోల్ గుమ్మజ్‌ను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. విస్తీర్ణం దృష్ట్యా ఇది దేశంలోనే పెద్ద గుమ్మజ్‌గా నిలిచింది. అయితే దీని నిర్మాణం పూర్తయ్యాక, కరీముల్లా అందులో సమాధి కావడానికి ఇష్టపడలేదు. దాంతో గురువు ఇష్ట ప్రకారం ఆయన మృతదేహాన్ని గుమ్మజ్ పక్కన గల ఖాళీ స్థలంలో సమాధి నిర్మించారు. అనంతరం అబ్దుల్ వహాబ్ మరణించాక ఆయన దేహాన్ని గుమ్మజ్‌లో సమాధి చేసినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 1958 సంవత్సరంలో కేంద్ర పురావస్తుశాఖ ఈ చారిత్రక కట్టడాన్ని రక్షణ కోసం తన సంరక్షణలోకి తీసుకుంది. దీన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు జిల్లా అధికారులు కృషి చేస్తున్నారు.

పత్తి కొనుగోలుకు సమాయత్తం



- కర్నూలులో 12, నంద్యాలలో 3 సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రైతు సేవా కేంద్రాల్లో వివరాలు ఇవ్వాలి
- అన్నదాతలకు ఏడీఎం నారాయణమూర్తి సూచన

కర్నూలు/కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల నుంచి పత్తి కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మార్కెటింగ్ శాఖ కర్నూలు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటానికి రూ.7,521ని సీసీఐ అధికారులు చెల్లించేందుకు నిర్ణయించారని అన్నారు. ఈ మేరకు శ్రీనాగేంద్ర జున్నింగ్ ఫ్యాక్టరీ, జయంత్ కాటన్ ఇండస్ట్రీ, ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ, శ్రీలక్ష్మి చెన్నకేశవ ఇండస్ట్రీ, ఐసా ఆర్య కాటన్ ఫ్యాక్టరీ, ఎంఎస్ ధరశ్రీ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ, ఎమ్మిగనూరులో శ్రీమురాజ్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్, శ్రీమహాలక్ష్మి కాటన్ ట్రేడర్స్ శ్రీశివ జిన్నింగ్ ప్రాసిసింగ్ యూనిట్, కల్లూరు మండలంలోని పెంచికలపాడులో మంజిత్ కాటన్ ఫ్యాక్టరీ, మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీ, మాధవ కాటన్ ఫ్యాక్టరీలలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నంద్యాలలో మురారి, ఏఎంసీ, మారంలక్ష్మి జిన్నింగ్ మిల్లులో రైతుల నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు వెంటనే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందేందుకు తమ పొలం వివరాలను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏడీఎం విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- నగర పాలక అధికారులతో మంత్రి టీజీ భరత్ సమీక్ష
- కార్పొరేటర్లు తెలిపిన సమస్యలకు ప్రాధాన్యమివ్వాలి
- మరో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. శనివారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో నగర అభివృద్ధి పనులపై నగర పాలక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా సచివాలయ అడ్మిన్లతో మంత్రి సమావేశం అయ్యారు. సచివాలయ సిబ్బంది స్థానిక కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో చిన్నపాటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఏవైనా కష్టతరమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు కంపెనీ ప్రతినిధితో నగరాన్ని అభివృద్ధి చేసే విధంగా వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివిధ రకాల సూచనలు, సలహాలు తీసుకున్నారు. త్వరలోనే ఆ కంపెనీ ప్రతినిధి నగరానికి వచ్చి అన్ని విధాలుగా నగరాన్ని స్మార్ట్ సిటీ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి కోరారు. అనంతరం అధికారులతో పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ముందుగా గత నెల 30న నిర్వహించిన సమీక్షకు సంబంధించిన పనరుల పురోగతిని మంత్రికి అధికారులు వివరించారు. నగరంలో దోమల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు తమ టీజీవి సంస్థల నుంచి హైపో ద్రావణాన్ని ఉచితంగా అందిస్తామన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి మరో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. పార్కు స్థలాల అన్యాక్రాంతం, రహదారుల ఆక్రమణమపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గార్గేయపురం డంప్‌యార్డు వద్ద మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ నిర్మాణ పనులపై అడిగి తెలుసుకున్న మంత్రి వాటి నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి. కృష్ణ, ఆరోగ్య అధికారి కే. విశ్వేశ్వరరెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఓ జునైద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

భారీగా పతనమైన పత్తి ధర

ఒక్క రోజులోనే రూ.300 పైగా తగ్గిన వైనం



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శనివారం పత్తి ధర భారీగా పతనమైంది. ఒక్క రోజులోనే క్వింటానికి పత్తి ధర రూ.300 తగ్గింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే పత్తి ధరలు మార్కెట్‌లో పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పత్తి ధరలు పెరుగుతుందని ఆశించినప్పటికీ ధరలు పతనమవుతుండడంతో తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని, పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేక అప్పుల పాలౌతున్నామని కన్నీరు కారుస్తున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ కూడా దసర పండుగ రోజు కొనుగోలు చేస్తామని ప్రకటించి పత్తా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీసీఐ పత్తిని కొనుగోలు చేసి మద్దతు ధర అయినా అందించాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. 6,546 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ట ధర రూ.4,789, గరిష్టదర రూ.7,389 మధ్యస్థ ధర రూ.7,189 పలికింది.

మలిపొద్దు వెలుగు



తమ్మరాజుపల్లె సమీపంలో ఆకాశానికి తిలకం దిద్దినట్లుగా సాయం సంధ్యావేళ సూరీడు



నంద్యాల పట్టణ సమీపంలో కుందూ ప్రవాహంలో వెండికాంతులీనుతూ పడమటిన వాలిపోతున్న భానుడు

వెలుగును కబళిస్తూ చీకట్లు పడమటి కొండల్లోకి వాలిపోతూ సూరీడు మసకబారుతున్న ఆకాశానికి తిలకం దిద్దినట్లు మలిపొద్దు విద్యుత్తు తీగలపై తేలియాడుతున్నట్లు కనువిందు చేస్తూ...

ఓర్వకల్లు మండలం తమ్మరాజుపల్లె - సోమయాజులపల్లె బండ్లకనుమ ఘాట్ రోడ్డు ప్రాంతంలో కనిపించిన దృశ్యాలు ఇవి - కర్నూలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

ఏపీ ప్రభుత్వం వర్సెస్ తుంగభద్ర బోర్డు

5వ పేజీ తరువాయి

కర్నూలు జిల్లా పరిధిలో తుంగభద్ర దిగువ (ఎల్లెల్సీ) 205.45 కి.మీల నుంచి 250 కి.మీల వరకు రూ.300 కోట్లు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ రూ.100 కోట్లు కలిపి రూ.400 కోట్లతో ఆర్‌సీసీ లైనింగ్ పనులకు 13 ప్యాకేజీలకు 2023 జనవరి 1న ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు. నిబంధనలు పాటించలేదని యారో కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చింది. రాజకీయ నాయకులు, కొందరు టీబీపీ బోర్డు అధికారులు ఆ కాంట్రాక్ట్ సంస్థపై ఒత్తిడి తీసుకొచ్చి స్టే ఎత్తివేయించారని సమాచారం. కర్నూలు జిల్లాకు చెందిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు రంగ ప్రవేశం చేసి బళ్లారిలో మకాం వేసి పనులను కాంట్రాక్టర్లకు పంపకాలు చేశారు. ఇందుకు ఆ ఎమ్మెల్యేలకు 5 శాతం వాటా అంటే దాదాపు రూ.20 కోట్లు ఇచ్చేలా ఒప్పందం జరిగినట్లు సమాచారం. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలో ఆ కాంట్రాక్టరు ఒక్కటే షెడ్యూలు దాఖలు చేసేలా రాజకీయ ఒత్తిళ్లు తీసుకొచ్చి 5 శాతం అధిక ధరలకు పనులు దక్కించుకున్నారని తెలుస్తోంది. టీబీపీ బోర్డు ఇంజనీర్లు ఒప్పందం కూడా చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాధారణ ఎన్నికలు రావడంతో కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టలేదు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ కూటమి సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి.. మొదలు పెట్టని పనులు సహా 25 శాతంలోపే పురోగతి ఉన్న పనులు రద్దు చేస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం గత నెల సెప్టెంబరు 27న ఫైనాన్స్ యూఓ నోట్ నంబరు: 2569644 ఆదేశాలు జారీ చేసింది.

ఆ ఉత్తర్వులు వర్తించవు..!

తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు సమావేశంలో తీసుకునే నిర్ణయాలే కీలకమని, ఏపీ ప్రభుత్వం ఆదేశాలు వర్తించవని బోర్డు అధికారులు అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఇప్పటికీ మొదలు పెట్టని ఆ పనులు రద్దు చేయబోమని వారు తేల్చిచెబుతున్నారు. ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు-94 ప్రకారం టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ అప్రూవల్ తీసుకుని, ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టర్‌లో టెండర్లు పిలిచినప్పుడు.. ఇంకా మొదలు కాని పనులు రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఎందుకు వర్తించవని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి వైసీపీ ఎమ్మెల్యేల సిఫారసు మేరకు టెండర్లు వేసిన ఆ పార్టీతో సన్నిహిత సంబంధాలు కలిగిన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే బోర్డు అధికారులు ఇలాంటి వాదనలు తెరపైకి తెస్తున్నారని, ఏపీ ప్రభుత్వం రూల్స్ పాటించాలని బోర్డు నిబంధనల్లో స్పష్టంగా ఉందని ఓ కాంట్రాక్టరు పేర్కొన్నారు. ఆర్‌సీసీ లైనింగ్ పనులకు మళ్లీ టెండర్లు పిలవాలని ఓ కాంట్రాక్టరు తుంగభద్ర బోర్డుకు లేఖ రాశారు. పనులు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిస్తే పోటీ పెరిగి 5 శాతం తక్కువ (లెస్)కు టెండర్లు వేసే అవకాశం ఉందని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.40 కోట్లు వరకు ఆదా అవుతుందని, దీనిపై ఏపీ సీఎం చంద్రబాబుకు కూడా ఫిర్యాదు చేస్తామని కాంట్రాక్టరు పేర్కొన్నారు. దీనిపై టీబీపీ బోర్డు ఇన్‌చార్జి ఎస్‌ఈ నీలకంఠరెడ్డిని ఆంధ్రజ్యోతి ఫోన్లో వివరణ కోరగా అదనపు నిధులతో ఎల్లెల్సీ లైనింగ్ పనులు చేపట్టారన్నారు. ఏపీ ప్రభుత్వం 55 శాతం, కర్ణాటక ప్రభుత్వం 45 శాతం నిధులు చెల్లిస్తుందన్నారు. టెండర్లను బోర్డు ఆమోదించడంతో రద్దు చేయాల్సిన అవసరం లేదని, దీనికి ఏపీ ప్రభుత్వం ఆదేశాలు వర్తించవని పేర్కొనడం కొసమెరుపు.



తుంగభద్ర దిగువ కాలువ

ఉల్లి సమస్యపై మంత్రి అచ్చెన్నాయుడు సమావేశం

- ఈనామ్ సర్వర్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలి
- మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశం
- కలెక్టర్, మార్కెటింగ్ అధికారులకు పలు సూచనలు



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా రైతుల్ని, మార్కెటింగ్ శాఖ అధికారులను ముప్పతిప్పలు పెడుతున్న ఈనామ్ సర్వర్‌లో ఆటంకం సమస్యపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. ఉల్లి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శనివారం గుంటూరులోని తన చాంబరులో మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించినట్లు మార్కెటింగ్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. వేలల్లో పేరుకుపోయిన ఉల్లి నిల్వలను అవసరమైన లారీలను ఏర్పాటు చేసి బయటకు వెళ్లేలా చూడాలని, రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కర్నూలు కలెక్టర్ పి. రంజిత్ బాషా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, రవాణా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఉద్యానశాఖ, కమిషన్ ఏజెంట్లు, లారీ ఓనర్ల అసోసియేషన్ నాయకులతో మాట్లాడి వెంటనే కొనుగోళ్లు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఏడీఎం నారాయణమూర్తి రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఆదేశాలపై కలెక్టర్ రాత్రి మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి పక్క మార్కెట్ యార్డులోని సిబ్బందిని కూడా కర్నూలు రప్పించి వెంట వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించినట్లు కర్నూలు మార్కెట్ యార్డు కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి రైతులు రాత్రి 12 గంటల నుంచి ఉదయం 8 గంటలలోపు రైతులు ఉల్లిని అమ్మకానికి యార్డుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ఉల్లిని ఆదివారం సాయంత్రంలోపు కొనుగోలు పూర్తి చేస్తామని ఆమె ప్రకటించారు.

పశుగణనకు సిద్ధం

- నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ హెచ్చరిక

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణన నిర్వహణపై ఈ నెల 21న సలహాలు, సూచనలు పశుసంవర్ధక శాఖ అధికారులకు, సిబ్బందికి అందించామని, ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుంబాలకు చెందిన పశువుల వివరాలను నమోదు చేయాల్సి ఉందని పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల రాష్ట్ర కార్యదర్శి ఎంఎం. నాయక్ స్పష్టం చేశారు. శనివారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు జిల్లా నుంచి జేడీ శ్రీనివాస్, నంద్యాల జిల్లా నుంచి మోహన్ నాయక్‌తో పాటు డిప్యూటీ డైరెక్టర్లు, ఏడీఏలు తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు పశువులు, ఇతర జీవాల పెంపకందారులు సరైన సమాచారాన్ని అందించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పశుగణన ప్రక్రియ పూర్తయినట్లు గుర్తుగా ప్రతి ఇంటి ముందు ఆ ఇంటి తలుపు కుడి ఎగువ మూలనలో స్టిక్కర్లు అతికించాలని తెలిపారు. పశుగణన పూర్తిగా విజయవంతం చేయడం వల్ల ఈ జీవాల పెంపకందారులకు పూర్తి స్థాయిలో జీవనోపాధికి అవసరమైన పథకాలు, కార్యక్రమాలు రూపొందించడానికి సులువు అవుతుందని నాయక్ జిల్లాల అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 5,390 మంది ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొంటున్నారని, 1,237 మంది సూపర్‌వైజర్లు, 45 మంది స్క్రూటినీ ఆఫీసర్లు, 21,173 గ్రామాలు, 3,929 పట్టణ వార్డుల్లో ఈ సర్వే చేపడుతున్నట్లు నాయక్ తెలిపారు.

రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా నేషనల్ హైవేస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జాతీయ రహదారుల నిర్మాణాలు, భూసేకరణ తదితర అంశాలపై నేషనల్ హైవేస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్-44, కర్నూలు-కడప రోడ్డు, సఫా కాలేజీ నుంచి ఆత్మకూరు రోడ్డు, సూరత్-చెన్నై రోడ్డు, మంత్రాల యం బైపాస్, నగరి-జడ్చర్ల రోడ్ల భూసేకరణకు సంబంధించి సంబంధిత రైతుల భూ రికార్డులను పరిశీలించి నష్టపరిహారాన్ని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బి.తాండ్రపాడు నుంచి గార్గేయాపురం వరకు జరుగుతున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులను నవంబరు 15వ తేదీ నాటికి పూర్తయ్యేలా పనులు వేగవంతం చేయాలని అన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న రోడ్ల నిర్మాణ పనులను మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాల ని మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆర్డీవో సందీప్ కుమార్, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చడానికి రూ.11.16 కోట్లు మంజూరు

జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలను పూడ్చివేసేందుకు ప్రభుత్వం 11.16 కోట్లను మంజూరు చేసిందని, డిసెంబరు ఆఖరు నాటికి ఈ మరమ్మతులు పూర్తి కావాలని కలెక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వంద రోజుల లక్ష్యాల సాధనపై (ఫేజ్-2) జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి తుగ్గలి బాలురు, బాలికల గిరిజన సంక్షేమ వసతి గృహాలను వేరు చేసేందుకు కాంపౌండు వాల్ పనులకు రూ.4 లక్షలు మంజూరు చేశామని, ఆ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ సంక్షేమ శాఖల వసతి గృహాలలో అదనంగా 374 నూతన టాయిలెట్ల ఏర్పాటుకు ఎస్టిమేట్ సిద్ధం చేసి స్వచ్ఛాంధ్ర మిషన్ ఎండీకి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత సంక్షేమ శాఖల వసతి గృహాల అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, సీపీవో హిమ ప్రభాకర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 27వ తేదీ ఆదివారం వరకు పొడిగించినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి రంగలక్ష్మీదేవి శనివారం తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ ప్రాతిపదికన ఉంటుందని చెప్పారు. ఉచిత శిక్షణ కావాల్సిన అభ్యర్థులు ఈ నెల 27లోపు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో సరళమైన రీతిలో దరఖాస్తులు నమోదు చేసుకోనేందుకు సేవలు పొందుపరిచిట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నవంబరు 3న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2,4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం విడుదల చేశారు. 2వ సెమిస్టర్‌లో 1068 పరీక్షలు రాయగా 214 మంది, 4వ సెమిస్టర్‌లో 1866 మంది పరీక్షలు రాయగా 460 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాల సూచించారు.

ధనదాహంతో కుటుంబాన్ని వీధికి లాగిన జగన్

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ధనదాహంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబాన్ని వీధికి లాగారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తొమ్మిది నెలలు మోసి కని పెంచిన తల్లి.. రక్తం పంచుకు పుట్టిన చెల్లి పట్ల కూడా దుర్మార్గంగా వ్యవహరిస్తు న్నారని అన్నారు. జగన్‌కు రాజకీయాల్లో కొనసాగే హక్కు లేదన్నారు. ఆస్తి వ్యవహాలను కూర్చొని మాట్లాడుకోవాలని, అయితే కుటుంబ పరువును నడి రోడ్డులో పెట్టారని అన్నారు. తాను వ్యవహరిస్తున్న తీరుపై అంతరాత్మను ప్రశ్నించుకోవాలని జగన్‌కు సూచించారు. జగన్ మద్దతుగా వంత పాడుతున్న ఆ పార్టీ నాయకులకు సిగ్గు ఉందా? అని మండిపడ్డారు. సీఎంగా చేసిన జగన్ తీరును చూసి ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఇకనైనా మారాలని, నీతి వంతమైన రాజకీ యాలు చేయలేక పోతే క్షమాపణలు చెప్పి రాజకీయ సన్యాసం తీసుకోవాలని సోమిశెట్టి జగన్‌కు సూచించారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

- ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలు అవసరమని ఆర్‌యూ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ తెలిపారు. శనివారం సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆర్‌యు అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వాలీబాల్, సెపక్‌తక్రా, చెస్, బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజేతలు కావాలని కోరారు. కళాశాల డీన్ వై.శౌరీలు రెడ్డి, కోఆర్డినేటర్ డా.శివకిషోర్, రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ డా.కే.శాంత, పీడీలు చంద్రశేఖర్, మూర్తయ్య, డా.కళ్యాణ్ వెంకటేశ్ పాల్గొన్నారు. వాలీబాల్ విజేతగా సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలపై ఆర్‌యూ కళాశాల జట్టు 25-23, 25-10 పాయింట్లతో గెలిచింది. పత్తికొండ జట్టుపై ఎస్ఆర్‌కే డీసీ జట్టు 26-24, 25-16 పాయింట్లతో గెలిచింది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్ రావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ సుదర్శన్ రావు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ఎస్.సుదర్శన్ రావు సూచించారు. శనివారం జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న జిగ్నాస-2కే24 ఐఎస్‌టీఈ రాష్ట్ర అవార్డుల ముగింపు నిర్వహించారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ చూపిన ఇంజనీరింగ్ కళాశాలల్లోని లెక్చరర్లు, విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రొ.రంగ జనార్దన్, ఐఎస్‌టీఈ కార్యదర్శి డా.ఈశ్వర్ రెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ ఎంఎం నాయుడు, అకడమిక్ రిలేషన్ మేనేజర్ శ్రీనివాస్ రామాంజన్, కళాశాల చైర్మన్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డా.బి.శ్రీనివాసులరెడ్డి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి

నందికొట్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డా. రామకృష్ణారావు ఆదేశించారు. శనివారం నందికొట్కూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో రైతు సేవ కేంద్రాల సిబ్బందికి సామర్థ్యం పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డా. రామకృష్ణారావు, డిఆర్‌సి ఏవో హేమలత, వ్యవసాయ సహాయ సంచాలకులు విజయశేఖర్, టెక్నికల్ వ్యవసాయ అధికారి, మిడ్తూరు, నందికొట్కూరు అగ్రికల్చర్ ఆఫీసర్లు పీరు నాయక్, షేక్షావళి, వ్యవసాయ విస్తరణ అధికారిని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలే బలం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


కరపత్రాలను విడుదల చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే బలమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మండలంలోని హుశేనాపురం గ్రామంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షలు ప్రమాద బీమా సౌకర్యాన్ని సీఎం చంద్రబాబు నాయుడు కల్పించారని చెప్పారు. రూ.లక్ష చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం ఉంటుందన్నారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి సభ్యత్వాన్ని వేగవంతం చేయాలన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో జిల్లాలో హుశేనాపురం మొదటి స్థానంలో నిలిచేలా కష్టపడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, బజారు, నారాయణ, వేణు, నాగరాజు, జయకృష్ణ, మహేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన బాలుడి మృతి

దేవనకొండ, అక్టోబర్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంద్రీలో శుక్రవారం గల్లంతైన బాలుడు మహేష్(5) మృతి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆచూకీ కనపడకపోవడంతో చీకటి పడేంతవరకు హంద్రీ సమీపంలో వెతికారు. శనివారం ఉదయం గ్రామ సమీపంలో హంద్రీలో బాలుడి మృతదేహం తేలియాడుతుండగా గ్రామస్థులు గుర్తించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం

ఆదోని రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో పాదచారుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం నెట్టేకల్ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన బోయ నాగిరెడ్డి (49) పశుగ్రాసం కోసం తోపుడు బండితో రోడ్డుపై వెళ్తుండా చిన్నపెండేకల్లు నుండి ఆదోని వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించామని, మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఆర్‌ఎంపీ దారుణ హత్య

- మృతదేహాన్ని జీఎన్ఎస్ఎస్‌లో పడేసిన నిందితులు
- బెలుం శింగవరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులపై అనుమానం


కొండయ్య(ఫైల్)

కొలిమిగుండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న బెల్లం కొండయ్య(50) దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కొండయ్య శనివారం మధ్యాహ్నం బెలుంశింగవరం గ్రామ సమీపంలోని జీఎన్ఎస్ఎస్‌లో తీవ్రమైన గాయాలతో శవమై తేలాడు. కొండయ్య మధ్యాహ్నం నుండి కనిపించడం లేదంటూ శుక్రవారం రాత్రి భార్య వెంకటేశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే శనివారం మధ్యాహ్నానికే మృతదేహం జీఎన్ఎస్ఎస్‌లో బయటపడటంతో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. హత్య కేసుగా నమోదుచేసి, విచారణ చేపడుతున్నామని, మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు సీఐ తెలిపారు. కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్ రప్పించి సంఘటనా స్థలంతో తనిఖీ చేశారు.

ఒంటిపై బంగారం కోసమే హత్య..?

ఆర్‌ఎంపీ వైద్యుడు కొండయ్య ఒంటిపై ఉన్న బంగారం గొలుసు, బంగారం ఉంగరాల కోసమే ఈ హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. బెలుంశింగవరం గ్రామ సమీపంలో తోటలో నివాసం ఉండే వృద్ధ దంపతులు హత్య చేసినట్లు స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సదరు వృద్ధ దంపతుల నుంచి కొండయ్యకు ఫోన్ రావడంతో వైద్యం చేయడానికి వెళ్లాడని, ఆ తర్వాతనే కొండయ్య ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇప్పటికే వృద్ధ దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

పని నుంచి బాలుడికి విముక్తి

కర్నూలు లీగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తండ్రికి ఓ హత్య కేసులో జీవిత ఖైదు పడటంతో అనాథగా పొలం పనులకు వెళ్తున్న బాలుడి విషయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జోక్యం చేసుకుంది. ఈ మేరకు పాఠశాలలో చేర్పించేందుకు శనివారం ఏర్పాట్లు చేశారు. కర్నూలుకు చెందిన ఓ వ్యక్తికి హత్య కేసులో కోర్టు గతంలో జీవిత ఖైదు విధించింది. అతను కడప సెంట్రల్ జైలులో జీవిత శిక్ష అనుభవి స్తున్నాడు. అతని భార్య అంతకుముందే మరణించడంతో కొడుకుకు ఆలన పాలన లేకపోయింది. స్థానికంగా ఓ పాఠశాలలో చదువుతున్న బాలుడిని బంధువులు రోజుకు రూ.150 చొప్పున కూలి పనికి పంపసాగారు. విషయం తెలుసుకున్న తండ్రి కుమారుడి జీవితం దుర్భరమవు తున్నదని, తిరిగి ఏదైనా పాఠశాలలోకి చేర్పించాలని కడప న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకున్నాడు. కడప న్యాయ సేవాధికార సంస్థ ఆ దరఖాస్తును కర్నూలు న్యాయ సేవాధికార సంస్థకు పంపింది. దీనిపై కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది స్పందించి కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రికి విచారణ చేయాలని ఆదేశించారు. దీంతో బాలుడిని, బాలుడి చిన్నాన్నను, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ఎస్. జుబేదాబేగంను పిలిపించి విచారించారు. బాలుడిని కడప పాఠశాలలో చేర్పిస్తే కడప సెంట్రల్ జైలులో జీవిత ఖైదీ అనుభవిస్తున్న తండ్రిని తరచూ ములాఖత్ అయ్యే అవకాశం ఉంటుందని నిర్ణయించి కడపకు పంపే ఏర్పాట్లను చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో హ్యాంగ్‌ఓట్ హోటల్ వద్ద రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మృతుడి వయస్సు 35 ఏళ్లు ఉంటుంది. రోడ్డు దాటుతుండగా.. బెంగళూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి వైద్యప రీక్షలు చేయించి మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి శరీరంపై పాచిరంగు ప్యాంట్, ఆకుపచ్చని అంగీ ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ట్రాఫిక్ పోలీసులను సంప్రం దించాలని సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'యురేనియం తవ్వకాలపై ఆందోళన వద్దు'


కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టును పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

దేవనకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలను పూర్తిస్థాయిలో జరపడం లేదని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ సూచించారు. మండలంలోని కప్పట్రాళ్లలో శనివారం కౌలుట్లయ్య ఆలయం వద్ద ఆర్డీవో గ్రామస్థులతో మాట్లాడారు. యురేనియం నిల్వలు ఏ మేర ఉన్నాయో పరిశీలించడం కోసం 68 బోర్లు ఏర్పాటు చేయడానికి మాత్రమే అనుమతి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం తవ్వకాలకు అనుమతులు రాలేదని, గ్రామాలు వీడాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం వెలమకూరు రస్తా, ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆర్డీవో వెంట ఆర్ఐ రెవెన్యూ అధికారులు లోకేశ్వరరావు, విజయ్‌భాస్కర్, మండల సర్వేయర్ మేఘశ్యామ్, వీఆర్వో దాదావలి, షఫీ, సూరీడు, హనుమన్న ఉన్నారు.

కార్యకర్తల కోసమే సభ్యత్వ నమోదు

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి


మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నందికొట్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వం తీసుకొని టీడీపీ కుటుంబ సభ్యులుగా కావాలని నియోజకవర్గ ప్రజలకు నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి శబరి తన నివాసంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. టీడీపీ కార్యకర్తల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సభ్యత్వంలో కేవలం రూ.100తో రూ.5 లక్షల ప్రమాద బీమాతో పాటు వారి పిల్లలకు విద్యా, ఉపాధి కల్పన కూడా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సివిల్‌సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కాకరవాడ చిన్న వెంకటస్వామి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, అశోకరత్నం, కట్టుబడి శ్రీనివాసులు, బంగారం వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గుణశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌర్య హాస్పిటల్ ప్రారంభం


హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ, ఎంపీ శబరి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవనగర్‌లో 50 పడకలతో కొత్తగా ఏర్పాటు చేసిన మౌర్య హాస్పిటల్‌ను శనివారం ఉదయం మంత్రులు టీజీ భరత్ ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు. మైనార్టీ మంత్రి ఐసీయును ప్రారంభించారు. టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, ల్యాబ్ ఎక్స్‌రే యూనిట్ మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఓటీ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఎం.రాజేష్ కుమార్, మానసిక వైద్య నిపుణుడు డా. కంచర్ల హరిప్రసాద్, ల్యాప్రోస్కోపిక్ అండ్ బేరియాట్రిక్ సర్జన్ డా. వసీం హసన్ రాజా షేక్, మత్తు మందు వైద్యనిపుణులు డా. రఘు ప్రవీణ్ మాట్లాడుతూ ఆర్థో, మెడిసిన్, గైనిక్, సర్జరీ, సైక్రియాట్రీ, ఐసీయూ సేవలు ఇషాక్ థెరపీ, కంటి సేవలు అత్యాధునిక పద్ధతిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పశువులపై సైకో దాడి

గోనెగండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని వీధుల్లో తిరుగుతున్న గుర్తు తెలియని సైకో శుక్రవారం రాత్రి నుంచి కనిపిం చిన ఆవులను, ఎద్దులను, బర్రెలను, గొర్రెపిల్లలను కత్తితో తీవ్రంగా గాయపరుస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు 20 ఆవులు, ఎద్దులను, రెండు బర్రెలను, ఆరు గొర్రెలను గాయపరిచినట్లు గ్రామస్థులు తెలిపారు. చింతలాముని నల్లారెడ్డి స్వామికి చెందిన పది ఆవులను గాయపరచడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామపెద్దలు టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులు పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధర్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ మాట్లా డుతూ అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే 9121101074 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. మూగజీవాలపై దాడికి పాల్పడుతున్న సైకోను వెంటనే అరెస్టు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

ఓవరాల్ చాంపియన్‌గా కర్నూలు, విజయనగరం జట్లు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు నగరంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, కేవీఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలెప్ప, రాష్ట్ర ఎస్జీఎఫ్ క్రీడల పరిశీలకుడు డా. బాబు, చిత్తూరు, కర్నూలు జిల్లా అండర్-19 ఆర్గనైజింగ్ సెక్రటరీ హర్షవర్ధన్ పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని వారు కోరారు. అనంతరం 100 మీటర్ల పరుగులో గెలుపొందిన క్రీడాకారులకు రూ.వేయి బహుమతి ప్రదానం చేశారు. వ్యక్తిగత ప్రోత్సాహకాలను ఇచ్చారు. బాలికల, బాలుర విభాగంలో అన్ని ఈవెంట్లలో మొదటి, రెండో స్థానాలు సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విజేతలు: బాలుర విభాగంలో కర్నూలు జిల్లా ప్రథమ స్థానం, శ్రీకాకుళం ద్వితీయ స్థానం, ఈస్ట్ గోదావరి మూడో స్థానాల్లో నిలిచాయి.

● బాలికల విభాగంలో విజయనగరం ప్రథమ, విశాఖపట్నం ద్వితీయ, శ్రీకాకుళం తృతీయ స్థానాలు సాధించాయి.

● ఓవరాల్ చాంపియన్‌షిప్ కర్నూలు జిల్లా కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో గోర్ని బెస్ట్ అథ్లెట్‌గా ఎస్. వెంకటేశ్ (కర్నూలు), బాలికల విభాగంలో విశాఖపట్నం త్రిష నిలిచారు.

టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట

● బొల్లవరంలో సభ్యత్వ నమోదును ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో ఎమ్మెల్యే గౌరుచరిత పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రూ. 100 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని, గుర్తింపు కార్డుతో కుటుంబాలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, టీడీపీ సీనియర్ నాయకుడు వాకిటి మాదేష్, తడకనపల్లె సర్పంచు సహారాబీ, టీడీపీ నాయకులు విజయ్, మస్తాన్‌నాయుడు, రమణారెడ్డి, రాముడు పాల్గొన్నారు.

గూడూరు: టీడీపీ కార్యకర్తలందరికీ అండగా ఉంటామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం గూడూరులో మాజీ నగర పంచాయతీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పౌలు, దండు సుందరరాజు, నాగప్ప యాదవ్, కౌన్సిలర్ బుడ్డంగలి, చాంద్‌బాషా, వాహిద్, విజయ్ కుమార్, అక్కలదేవి గిడ్డయ్య పాల్గొన్నారు.

● తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాది అని టీడీపీ సీనియర్ నాయకుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు అన్నారు. శనివారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పౌలు, దండు సుందరరాజు, నాగప్ప యాదవ్, కౌన్సిలర్ బుడ్డంగలి, చాంద్‌బాషా, వాహిద్, విజయ్ కుమార్, అక్కలదేవి గిడ్డయ్య పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రతి ఒక్కరూ రూ. 100 చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. శనివారం మండలంలోని గుండ్రేవుల గ్రామంలో మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప అధ్యక్షతన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దస్తగిరి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, శీలం వెంకటేశ్వర్లు. ధనుంజయుడు, సయ్యద్ బాబు, గోపాల్‌రెడ్డి, గంగన్న, శంకర్, బాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత


గూడూరులో టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

'ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి'

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వాడుకున్న విద్యుత్‌పై ఇందన కొనుగోలు సర్దుబాటు (ట్రూ అప్) పేరుతో విద్యుత్ చార్జీలు పెంచేందుకు విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి ఇచ్చిన రూ.6075 కోట్లు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా అధ్యక్షుడు బి.వాసుదేవయ్య, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి టి.మద్దిలేటి, న్యాయవాది మణిచంద్ర రాజు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని కలెక్టరేట్ ముందు పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నాలో ధర్నా చేపట్టారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పలు సందర్భాల్లో పెంచిన కరెంటు చార్జీలను చెల్లించలేక పేద మధ్య తరగతి ప్రజలతో పాటు, సూక్ష్మ, చిన్న పరిశ్రమల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని ట్రూ అప్ చార్జీలను రద్దు చేసి పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు సూక్ష్మ, చిన్న పరిశ్రమలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో యాకోబు, ఎండీ యూనుస్, సీవీ వర్మ, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.మద్దిలేటి, ఎస్.విజయ్ కుమార్, ఎస్.అన్వర్‌బాషా, కే.శ్రీనివాసులు, ఎస్ఆర్ గౌడు, ఎస్.శ్రీనివాసరెడ్డి, బి.రాజు, ఎ.మధు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కర్నూలు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీరామ్‌నగర్‌లో నారాయణమ్మ అనే మహిళ అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. నెల్లూరు జిల్లా విజమూరు మండలానికి చెందిన నారాయణమ్మ ఈనెల 24న కర్నూలు శ్రీరామ్‌నగర్‌లో నివాస ముంటున్న బంధువుల ఇంటికి వచ్చింది. 25వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి ఎవరికి చెప్ప కుండా వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధు వులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీ.దర్ రెడ్డి తెలిపారు.

3 స్కానింగ్ కేంద్రాలకు అనుమతి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా 3 స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లకు జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ (పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు) ఆమోదం తెలిపిందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలి పారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో పీసీ అండ్ పీఎన్‌డీటీకి సంబంధించిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి సలహా కమిటీ తనిఖీ చేసి సిఫారసు చేసిన 3 కొత్త స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లకు 9 రెన్యువల్‌లకు, 6 సవరణలకు సంబంధించిన దరఖాస్తులను కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఏడో అదనపు జిల్లా న్యాయాధికారి భూపాల్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

భారీ విరాళం ఇచ్చిన కేఎంసీ పూర్వ విద్యార్థులు

● రెండు పోర్టబుల్ స్కానింగ్ మిషన్లను అందించిన సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని చికాగోలో ఉంటున్న కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ అరుణ దంపతులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రూ.30 లక్షలు విరాళంగా అందించారు. కృష్ణారెడ్డి 1962 బ్యాచ్, అరుణ 1963 బ్యాచ్‌లో ఇక్కడే చదువుకుని అమెరికాలో స్థిరపడ్డారు. తాము చదువుకున్న వైద్యకళాశాలకు చేయూత అందించాలని ముందుకువచ్చారు. శనివారం ధన్వంతరి హాలులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి, గైనిక్, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాలకు రెండు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలను పంపిణీ చేశారు. గైనిక్ హెచ్‌వోడీ డా. శ్రీలక్ష్మి, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా. రామశివనాయక్‌కు సూపరింటెండెంట్ అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ గైనిక్ విభాగంలో కొత్తగా ఇచ్చిన పోర్టబుల్ అల్ట్రాసౌండ్ మిషన్‌తో కాన్పు సమయంలో రోగి దగ్గరకు వెళ్లి స్కానింగ్ చేయడానికి వీలు ఉంటుందన్నారు. రెండో మిషన్‌ను క్యాజువాల్టీకి వచ్చే రోగులకు దగ్గరకు వెళ్లి స్కానింగ్ చేయడానికి ఆర్ఐ సీయు ఏఎంసీలో వెంటిలేటర్ కేసులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ హెచ్‌వోడీ డా.రాధారాణి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డా.శివబాల, డా.కిరణ్ కుమార్, గ్రేడ్-2 నర్సింగ్ సూపరిం టెండెంట్ జి.విమలమ్మ పాల్గొన్నారు.


మిషన్లను హెచ్‌వోడీలకు అందజేస్తున్న సూపరింటెండెంట్

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ


ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో శ్రీరామ్ ఫైనాన్స్ సీనియర్ మేనేజర్ సంపత్ కుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు రీజియన్ శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో శనివారం కల్లూరు జడ్పీ హెచ్ఎస్‌లో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. శ్రీరామ్ ఫైనాన్స్ సీనియర్ మేనేజర్ కే.సంపత్ కుమార్ చేతుల మీదుగా ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. 8, 9, 10 తరగతి విద్యార్థులకు రూ.4వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.4,500లు చొప్పున 300 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు సంపత్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హుశేన్, శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదముస్లింలకు అండగా ఉండాలి: మంత్రి

కర్నూలు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పేదముస్లింలకు అండగా ఉండాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని మహ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ టేకర్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా మహమ్మద్ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శిగా గౌస్ రబ్బాని, సభ్యులుగా రమీజ్ బాషా, షేక్ మహబూబ్, షేక్ అబ్దుల్ మునాఫ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. టీజీ భరత్ మాట్లాడుతూ వక్ఫ్ కాంప్లెక్స్ నిధులను సక్రమంగా వినియో గించుకో వాలన్నారు. టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగం, డీఎండబ్ల్యూఓ సబియా, టీడీపీ నాయకులు జహంగీర్ బాషా, మన్సూర్ ఆలీఖాన్, అబ్బాస్, హమీద్, నవీద్ పాల్గొన్నా రు.

రైలు నుంచి జారి పడిన వ్యక్తి

కర్నూలు క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి రౌశన్ బర్మన్ (48) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఈయన తన మిత్రుడుతో కలిసి హుబ్లీ నుంచి బయలుదేరాడు. మార్గమధ్యలో వీరిద్దరు డోర్ పక్కనే కూర్చుని ఉన్నారు. ఇద్దరు నిద్రమత్తులో జారుకున్న తర్వాత కొద్దిసేపటికి బర్మన్ కనిపించలేదు. రైలు నుంచి ప్రమా దవశాత్తు కింద పడిపోయాడని భావించిన స్నేహితుడు పశ్చిమ బెంగాల్‌లో ఉన్న బర్మన్ సోదరుడు స్వాపన్ మహంత్‌కు ఫోను చేశాడు. ఆన్‌లైన్‌లో రైల్వే పోలీసుల నెంబరు తెలుసుకున్న ఆయన నంద్యాల ఎస్ఐకి ఫోన్‌లో సమాచారమిచ్చారు. రైలులో నుంచి పడిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు పోలీ సులకు సమాచారం ఇవ్వాలని రైల్వే సీఐ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

రోగి ప్రాణాన్ని కాపాడిన వైద్యులు



కోలుకున్న రోగితో నెఫ్రాలజీస్టు డాక్టర్ సిద్దార్థ్ హెరూర్

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్ఎంపీ నిర్లక్ష్యం రోగి ప్రాణాల మీదికి వచ్చింది. సకాలంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించడంతో సకాలంలో స్పందించడంతో ప్రాణపాయం తప్పింది. నగరానికి చెందిన 19 ఏళ్ల దినేష్ కుమార్ జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ ఓ ఆర్ఎంపీని సంప్రదించారు. ఆ ఆర్ఎంపీ యువకుడికి ఏఎం (ఇంట్రా మాసులర్ రైట్‌హిప్) ఇంజెక్షన్ వేయడంతో అతనికి కండరాల ఇన్‌ఫెక్షన్ అయింది. కండరాలు కుళ్లిపోయి దాని ప్రభావంతో రెండు కిడ్నీలు పాడైపోయాయి. యూరిన్‌బ్లాక్‌గా రావడంతో ఆ యువకుడు కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు వచ్చారు. నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్దార్థ్‌హెరూర్ రోగిని జాయిన్ చేసుకున్నారు. కుళ్లిపోయిన కండరాలను సర్జన్ డాక్టర్ భార్గవ్ తొలగించారు. ఆ తర్వాత నెఫ్రాలజిస్టు రోగి ఎమర్జెన్సీ వార్డులో ఉంచి ప్రత్యేక డయాలసిస్ చేశారు. హాస్పిటల్‌లో చేరిన రోజు రోగికి 20 ఎంఎల్ యూరిన్, 14 క్రియాటిన్ ఉండగా.. 10 రోజుల తర్వాత రికవరి అయిన రోగికి 0.9 క్రియాటిన్‌తో కోలుకున్నారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆర్ఎంపీలు ఇచ్చే ఇంజెక్షన్ వేసుకునే ముందు జాగ్రత్తగా తెలుసుకోవాలని సూచించారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

విజయ డెయిరీ డీజీఎం వివేకానంద్

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) వినియోగదారులకు శుచి, శుభ్రతతో కూడిన నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులతో పాటు మెరుగైన సేవలు అందించటమే తమ సంస్థ లక్ష్యమని విజయ డెయిరీ డీజీఎం వివేకానంద్ అన్నారు. కర్నూలులోని విజయ పాల డెయిరీలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్లాంటు పనితీరును శనివారం ఆయన పరిశీలించారు. డీజీఎం మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగంలో ఉన్న ప్లాంటు 55 వేల లీటర్ల పాల శుద్ధి సామర్థ్యాన్ని కలిగి ఉందని, కొత్త ప్రారంభించబోయే ప్లాంటు 60 నుంచి 70 వేల లీటర్ల పాలు, పెరుగు తయారీ సామర్థ్య కలిగి ఉందని చెప్పారు. ప్లాంటు ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయని, ప్లాంటు పనితీరును అంచనా వేసేందుకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నమన్నారు. వచ్చే నెలలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల అనుమతితో వారి చేతుల మీదుగా నూతన ప్లాంటును అధికారికంగా ప్రారంభిస్తామని వివేకానంద్ తెలిపారు. దీని ఏర్పాటు వల్ల పాత, కొత్త ప్లాంటు వినియోగంతో దాదాపు లక్ష లీటర్ల వరకు పాలు, పాల ఉత్పత్తులను సకాలంలో తయారు చేసి వినియోగదారులకు అందించవచ్చన్నారు. కొత్త ప్లాంటు వల్ల సేవలు మరింత సులువుగా, వేగంగా అందుతాయని వివేకానంద్ చెప్పారు.

క్షేత్రస్థాయిలో వైసీపీ బలోపేతమే లక్ష్యం: మాజీ మంత్రి

కల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు వైసీపీని బలోపేతం చేయడమే లక్ష్యమని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం నగరంలోని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మంత్రాలయం, ఆలూరు ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నగర మేయర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీకి రెండు పార్టీ పదవులతో పాటు 28 అనుబంధ సంఘాలకు నాయకులను ఎంపిక చేసేందుకు పార్టీ అధినేత ఆదేశించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కష్టపడి పనిచేసిన వారికి భవిష్యత్తులో మంచి అవకా శాలు కల్పించేందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణేశించారని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు రైతు బజార్ సమీపంలోని మహిళా మార్ట్ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల శనివారం ప్రారంభిం చి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకలక్ష్మి, విజయ భాస్కర్‌రెడ్డి, టీఎంలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే టీడీపీ ధ్యేయం

ఓర్వకల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే టీడీపీ ధ్యేయమని పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లులోని పెండేకంటి నగర్‌లో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్డును ఆయన పరిశీలించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్ఐ

కోడుమూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలో శనివారం సాయం త్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పాతబస్టాండ్‌లో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపితే జరిమానాలు విధిస్తామన్నారు.

పార్టీ సభ్యత్వంతో సంక్షేమం



టీడీపీ సభ్యత్వం అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు సంక్షేమం అందుతుందని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ప్రతి టీడీపీ కార్యకర్త సభ్యత్వం తప్పక తీసుకోవాలని సూచించారు. న్నారు. రూ.వంద చెల్లించి సభ్యత్వం చేసుకుంటే, రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామ్‌నాథ్ యాదవ్, వైస్ చైర్మన్ సాలి సాహెబ్, మండల కన్వీనర్‌లు పరామరెడ్డి, సుధాకర్, విజయభాస్కర్ గౌడ్, నర్సప్ప, సురేంద్ర, మండల నాయకులు రజని, డా. నెట్టప్ప, వెంకన్న, తిమ్మయ్య, గోవిందు, రాము యాదవ్, వీరన్నగౌడ్, కిష్టప్ప, మసాల జగన్, రామాంజినేయులు, మల్లికార్జున, కిట్టు, దద్దు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే కేసు

ఆలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆలూరు ఎస్‌ఐ వెంకట నరసింహులు హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆలూరు పట్టణంలోని మరిస్వామి మఠం వద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేస్తున్నఎస్‌ఐ

బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

మద్దికెర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామ శివారు మొలగవెల్లి రైల్వేస్టేషన్ వద్ద శనివారం ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. మొలగవెల్లి నుంచి లక్ష్మి, ప్రవీణ్ వస్తుండగా. డోన్ పట్టణానికి చెందిన యువకులు మొలగవెల్లికి వస్తూ ఢీ కొన్నారు. లక్ష్మి ప్రవీణ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో మద్దికెర వైద్యశాలకు తరలించారు. కాగా డోన్ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వివరాలు తెలియాల్సి ఉంది.

సాధారణానికే ప్రాధాన్యం

- సాధారణ ప్రసవాల్లో ఆస్పరి పీహెచ్‌సీ రెండో స్థానం
- గతంలో అవార్డు అందజేసిన ప్రభుత్వం
- గర్భిణులు, బంధువుల హర్షం



ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సాధారణ ప్రసవాల్లో ముందుంది. ఇక్కడి వైద్యులు సిజేరియన్ కంటే సాధారణానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో ప్రభుత్వ అవార్డు కూడా వచ్చింది. దీంతో గర్భిణులు, వారి బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యమిస్తూ ఆస్పరి ప్రాథమిక కేంద్రం ఆదర్శంగా నిలిచింది. ఇక్కడి వైద్యులు, సిబ్బంది క్రమశిక్షణ, ఓర్పుతో పనిచేస్తుండటంతోనే ఇది సాధ్యమైనట్లు గర్భిణులు, వారి బంధులు అంటున్నారు. ఆస్పరి పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురామి రెడ్డితో పాటు మరో ఇద్దరు మహిళా వైద్యులు, ముగ్గురు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

ఇతర మండలాల నుంచి గర్భిణులు

ఇక్కడి వైద్యులు పనితీరుతో ఆస్పరి మండలం నుంచే కాకుండా పత్తికొండ, డోన్, తుగ్గిలి, మద్దికేర, దేవనకొండ మండలాల నుంచి గర్భిణులు ఇక్కడకు వస్తున్నారు.

సిజేరియన్‌తో నష్టం

సాధారణ కాన్పులు చేయకుండా సిజేరియన్‌తో దేహ దారుఢ్యం కోల్పోవడమే కాకుండా ఇతర సమస్యలు వస్తాయని వైద్యులు అంటున్నారు. తమ వద్దకు వచ్చే గర్భిణులకు సాధా రణ ప్రసవాలకే ప్రాధాన్యమిస్తున్నట్లు వారు తెలిపారు.

గతంలో అవార్డు..

పీహెచ్‌సీలో చేస్తున్న సాధారణ ప్రసవాలను గుర్తించిన ప్రభుత్వం అవార్డు కూడా అందజేసింది. స్థానిక పీహెచ్‌సీలో గత సంవత్సరం 498 సాధారణ కాన్పులు జరిగాయ ఈ ఏడాది ఇప్పటికే 260 దాకా కాన్పులు అయినట్లు వైద్యాధికారి రఘురామి రెడ్డి తెలిపారు. అయితే ఇక్కడ స్కానింగ్ సౌకర్యం లేకపోవడం, అదనపు గదులు లేకపోవడంతో కొంత ఇబ్బందులు ఉన్నాయి.



పరీక్షిస్తున్న వైద్యాధికారి

సాధారణ ప్రసవాలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో ఇక్కడి వైద్యులు విధులు నిర్వస్తున్నారు. జిల్లా స్థాయిలో ఏటా రెండో స్థానంలో ఆస్పరి పీహెచ్‌సీ నిలుస్తోంది. కాగా కోసిగి మండలంమొదటి స్థానంలో ఉంది.

అదనపు గదులు అవసరం

ఇతర మండ లాల గర్భిణులు కూడా వస్తారు. అలాగే ఇతర రోగులు9 కూడా ఇక్కడ చికిత్స చేయించుకుం టున్నారు. ప్రభుత్వం అదనపు భవనాలు మంజూరు చేస్తే బావుంటుంది.

- రఘురామిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆస్పరి



చక్కటి సేవలు..

ఇక్కడి ఆసుపత్రిలో సిబ్బంది చక్కగా సేవలిందిస్తున్నారు. గర్భిణులు ఆసుపత్రిలో డెలివరీ అయితే తల్లిబిడ్డకు ఆరోగ్యకరం. ప్రభుత్వం స్పందించి ఇక్కడి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

- లక్ష్మి, బిల్లేకల్లు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆలూరు, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఎఈ గురప్ప శనివారం తెలి పారు. కోయనగర్, అరికేర రోడ్డులో తీగలు మార్చి కొత్త పోల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలి పారు.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స.హ. చట్టంపై అవగాహన

వెల్దుర్తి, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి)26: రైతు సేవా కేంద్రంలో శనివారం ఏవో అక్బర్‌బాషా సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. విధి విధానాలు, కాలపరిమితి గురించి ఆయన వివరించారు.

నిబంధనల మేరకు అనుమతి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భదర్వాజ్

- బాణసంచా వ్యాపారులతో సబ్ కలెక్టర్

ఆదోని, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): బాణసంచా స్టాల్స్ ఏర్పాటుకు ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శనివారం కార్యాలయంలో డివిజన్‌లోని బాణ సంచా వ్యాపారులతో సమావేశం నిర్వహిం చారు. ప్రతి స్టాల్ వద్ద 200 లీటర్ల సామర్థ్య మున్న డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉంచాలని, ఇసుక నింపిన బకెట్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. దుకాణాలకు మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాల ని అధికారులను ఆదేశించారు. దుకాణాలను రేకుల షెడ్‌తో నిర్మించాలని, చిన్న పిల్లలకు బాణసంచా విక్రయించకూడదన్నారు. ఐఎస్‌ఐ ముద్ర ఉన్న బాణాసంచా మాత్రమే అమ్మేలా చూసుకోవాలన్నారు. అగ్నిమాపక వాహనం, అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. తహసీల్దార్ శివరాముడు, డీటీలు వీరేంద్ర గౌడ్, నిజాముద్దీన్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు సూర్య మోహన్ రావు, మంజునాథ్ పాల్గొన్నారు

చంద్రబాబుతోనే సముచిత స్థానం

ఆలూరు, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబుతోనే నాయిబ్రాహ్మణలకు సముచిత స్థానం ఉంటుందని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ గూళ్యం రామంజనేయులు, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఆలయాల పాలక మండలిలో నాయీ బ్రహ్మణులకు చోటు కల్పించడం హర్షణీ యమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాయీబ్రహ్మణలకు అన్యాయం జరిగిం దని అన్నారు. చంద్రబాబు చారిత్రాత్మక నిర్ణయంతో బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. సంఘం నాయకులు ధనంజయ, రంగస్వామి, లింగప్ప, వెంకటేశ్వర్లు, గణేష్ పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

విద్యార్థికి బంగారు పతకం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో జరిగిన క్రీడా పోటీలలో విశ్వనారాయణ జూనియర్, వొకేషనల్ కళాశాలకు చెందిన విద్యార్థికి 5 కిలోమీటర్ల పరుగు పందెంలో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించారు. శనివారం విద్యార్థులను కరస్పాండెంట్ మల్లికార్జున అధ్యాపకులు అభినందించారు. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ గ్రూప్‌కు చెందిన విద్యార్థి మల్లికార్జున ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. నర్సింగ్ విద్యార్థిని శృతి అథ్లెటిక్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. తమ విద్యార్థులు క్రీడా పోటీలలో రాణించడం అభినందనీయమన్నారు.

సామాజిక కార్యకర్తకు డాక్టరేట్

ఆదోని టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, వంకదారు శ్రీనాథ్ గుప్తాకు డాక్టరేట్ అవార్డు లభించింది. తమిళనాడు హోసూరు పట్టణంలోని ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ అకాడమీ ఫౌండర్ మాస్టర్ విజయ్, మాజీ ఎమ్మెల్యే మనోహరన్, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ నాగఫణి సాయి, డాక్టర్ శివమూర్తి చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. ఆదోనికి చెందిన ఎస్‌ఆర్‌ఐ నగేష్ సౌన్యంతో అనేక మెడికల్ క్యాంప్‌లు నిర్వహించిన కారణంగా, అవార్డు లభించడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీనాథ్ గుప్తా తెలిపారు.

పకడ్బందీగా చేయాలి



పోస్టరు విడుదల చేస్తున్న అధికారి, నాయకులు

మద్దికెర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పశుగణన పకడ్బందీగా చేయాలని మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి, పశు వైద్యాధికారి కృష్ణ నాయక్ అన్నారు. శనివారం పెరవలి గ్రామంలో 21వ అఖిల భారత జాతీయ పశుగణన సర్వే పోస్టర్లను విడుదల చేశారు. సర్వే మూడు నెలల పాటు ఉంటుం దన్నారు. ప్రతి ఇంటికి తిరిగి 15 కీలక అంశాలపై, పశువులకు, జీవాలకు సంబం ధించి ఆన్‌లైన్ యాప్‌లో సమాచారాన్ని సేకరిస్తామన్నారు. ప్రజలు పూర్తి సహకారాలు అందించాలన్నారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, పశు వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సహకరించాలి

ఆదోని రూరల్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): బైపాసు కోసం స్థలాలు, భూములు కోల్పోయిన బాధితులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని తహసీల్దార్ శివరాముడు కోరారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. 800 మంది భూములు ఉన్నాయని, 320 మంది బాధితులు సహకరించడం లేదన్నారు. సందేహాలుంటే ప్రభుత్వ పరిహారం తీసుకుని కలెక్టర్‌కు విన్నవించుకోవ్చని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- ఈవో వీరయ్య

పత్తికొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పులికొండ రంగనాథ ఆలయ అబివృద్ధికి గ్రామస్థులు సహకరించాలని ఈవో వీరయ్య అన్నారు. శనివారం ఆలయంలో గ్రామస్థులతో ఆలయ అబివృద్ధిపై మాట్లాడారు. అనంతరం కొండపై ఉన్న లక్ష్మీదేవి ఆలయం పరిసర ప్రాంతంలో ఖాళీస్థలాన్ని పరిశీలించారు. ఆలయానికి వచ్చేందుకు కొండ మార్గంలో రహదారిని ఏర్పాటుచేసేందుకు గతంలో పనులుమంజూరైనా, కొన్ని కారణాలతో నిలిచిపోయినట్లు గ్రామస్థులు ఆయనకు తెలిపారు. రహదారి ఏర్పాటుచేసి ఆలయం వద్దఉన్న స్థలంలో భక్తుల సౌకర్యంకోసం షెడ్లు, బాత్రూంలు నిర్మిస్తే ఇబ్బందులు తొలగిపోతాయని గ్రామస్థులు కోరారు. వీటిని పరిశీలించి దేవదాయ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపుతామని ఆలయ అబివృద్ధికి అన్నివిధాలా కృషిచేస్తామని వారికి హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్ర, గొర్రెలచినరంగడు, కరువగేరి రమేష్ తోపాటు ఆలయ సిబ్బది బాలచంద్రుడు, చంద్ర ఉన్నారు.

సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా



బసాపురం గ్రామంలో సభ్యత్వ నమోదు వివరిస్తున్న వెంకటేష్ చౌదరి



పత్తికొండలో సభ్యత్వనమోదు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

- ప్రారంభమైన టీడీపీ సభ్యత్వ నమోదు

ఆదోని, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి) : రూ.వంద చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా వర్తిస్తుందని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి అన్నారు. శనివారం మండల లోని బసాపురం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. నిరుపేద కార్యకర్తల పిల్లల చదువుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సాయం అందుతుందన్నారు.

పత్తికొండ: పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి అన్నారు. శనివారం పత్తికొండలో మైనార్టీ నాయకుడు మీరాహుసేన్ ఆధ్వర్యంలో పార్టీసభ్యత్వ నమోదును ప్రారంభించారు. లీగల్ సెల్ సభ్యుడు సురేష్‌కుమార్, బీసీసెల్ నాయకుడు రామానాయుడు, తెలుగుయువత నాయకుడు బత్తినలోక్‌నాథ్, కన్వీనర్ కడవల సుధాకర్, సింగం శ్రీనివాసులు, ఉచ్చీరప్ప ఉన్నారు.

వెల్దుర్తి: మండలంలో బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పార్టీ నాయకుడు సుబ్బరాయుడు శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. అలాగే వెల్దుర్తిలో మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, రమాకాంత రెడ్డి, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, గుంటుపల్లె గ్రామంలో ఈదుల వెంకటరాముడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

తుగ్గలి: సభ్యత్వ నమోదుతో కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, సర్పంచ్ చౌడప్ప అన్నారు. శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. శ్రీనివాసులు గౌడ్, ప్రతాప్ యాదవ్, మహేష్‌గౌడు, రంగారెడ్డి, మసాల శ్రీనివాసులు, నల్లగుండ్ల రవి, రామాంజనేయులు, ఈరమ్మ, శ్రీనివాస్, మునీశ్వర్‌గౌడు, రామాంజనేయులు, రామారావు, చాంద్‌బాషా తదితరులు ఉన్నారు.

మద్దికెర: పార్టీ సభ్యత్వంతో కార్యకర్త కుటుంబానికి భరోసా లభిస్తుందని జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు, సంజప్ప అన్నారు. శనివారం మండలంలోని మదనంతపురం గ్రామంలో టీడీపీ సభ్యత్వనమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హరినాథ్‌గౌడ్, తిమ్మప్ప, గద్దం మల్లికార్జున, శాంతిరెడ్డి, సుగ్గలప్ప తదితరులు ఉన్నారు.

లోపించిన పారిశుధ్యం

● డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపై నిలుస్తున్న వర్షపునీరు
● వెదజల్లుతున్న దుర్గంధం ● పొంచి ఉన్న అంటురోగాలు

కౌతాళం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప ఊరు దిబ్బలా ఉంది మండల కేంద్రమైన కౌతాళం పరిస్థితి. పేరుకు మేజర్ పంచాయతీ అయినా కనీసం గ్రామంలోని కాలనీల్లో చెత్తను తొలగించే వారు లేరు. గ్రామంలో కొన్ని కాలనీల్లో వర్షం పడితే కనీసం కాలు పెట్టడానికి కూడా వీలులేని పరిస్థితి. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుమీదనే పారి దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు మాత్రం కనీసం బ్లీచింగ్ పౌడర్‌ను కూడా వేయడం లేదు, గ్రామంలోని మాసలగేరి వీధిలో రెడ్డివీధి, బ్రహ్మణ వీధుల గుండా వచ్చే వర్షపు నీరు ముందుకు పోయేందుకు డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్ల మధ్యనే నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారుతున్నాయి. దోమల వల్ల కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం కనీసం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇలా గ్రామంలో దాదాపుగా పదిరోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రతి కాలనీలోని డ్రైనేజీ కాలువలు చెత్తచెదారంతో నిండిపోయాయి. రోడ్ల మీదనే చెత్తకుప్పలు పేరుకు పోయాయి. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ముఖ్యంగా అంబేడ్కర్ సర్కిల్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుపోవడంతో దుర్వాసన వస్తున్నా అటువైపు వెళ్తున్న ప్రజలు ముక్కున వేలు వేసుకుపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


అంబేడ్కర్ సర్కిల్‌లో రోడ్డుపైన పేరుకుపోయిన చెత్త


మాసలగేరిలో రోడ్డుపైనే నిలిచిన డ్రైనేజీ నీరు

శాంతించిన తుంగభద్రమ్మ

మంత్రాలయం వద్ద 308.64 మీటర్ల నీటిమట్టం


మంత్రాలయం వద్ద తగ్గిన తుంగభద్ర వరద ప్రవాహం

మంత్రాలయం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్రమ్మ శాంతించింది. శనివారం సాయంత్రం మంత్రాలయం వద్ద 308.64 మీటర్ల నీటి మట్టంతో 27,600 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. టీబీ డ్యాం నుంచి 1.06 లక్షల క్యూసెక్కుల నీరు నదికి విడుదల చేసిన విషయం తెలిసిందే. శనివారం మధ్యాహ్నం డ్యామ్ గేట్లను ఎత్తి 4,870 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 15,724 క్యూసెక్కుల నీరు వస్తుంది. వరద ప్రవాహం తగ్గడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

విద్యుత్ చార్జీలను పెంచడం సరికాదు: సీపీఐ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి విద్యుత్ చార్జీలను పెంచడం సరికాదని సీపీఐ పట్టణ కార్యదర్శి సమీ ఉల్లా అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చార్జీల పేరుతో ప్రజలపై రూ.6072కోట్ల భారాన్ని మోపిందన్నారు. ఏపీ విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రం లో నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశాన్ని సీపీఐ నాయకులు వీరేష్, మల్లికార్జునగౌడు, నరసింహులు, వీరేష్, ఖాజా, రామాంజనేయులు, నాగన్న, అజారుద్దీన్, రవి, ఖాదర్, సమీర్, రవిశంకర్‌లు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ఎమ్మిగనూరు రూరల్: ఆదోని పట్టణంలో జరిగే జిల్లా 30వ ఏఐఎస్ఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర కోరారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాల ముందు జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సామీర్, అబ్దుల్‌ఖాదర్, దస్తగిరి, శంకర్, వీరేష్ విష్ణు, సంతోష్, నాని, మహేష్ రఘులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు అయ్యినట్లు పట్టణ సీఐ సుదర్శన్ రెడ్డి శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. ఫిబ్రవరిలో అమృత బార్ అండ్ రెస్టారెంట్ క్యాషియర్ మిన్నప్ప పని ముగించుకొని నగదుతో ఇంటికి వెళ్తుండగా పట్టణానికి చెందిన బోయ దేవేంద్ర, బోయ నూరి, పిల్లి గోవు సురేష్ అడ్డుకోని కళ్లలో కారం పోడి చల్లి నగదు దోచ్చుకెళ్లారు. బాధితుడు మిన్నప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు. పై ముగ్గురుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో టీడీపీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు మునీరుద్దీన్‌కు పార్టీ సభ్యత్వాన్ని అందజేసి సన్మానించారు. అలాగే నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు పట్టణం, మండలం, నందవరం, గోనెగండ్లకు చెందిన టీడీపీ నాయకులు నరసన్న గౌడు, జగదీష్, జహీర్, గట్టు అల్తాఫ్, ఖాసీంవలి, వెంకటరామిరెడ్డి, మల్లయ్య, సురేష్‌చౌదరి, వలితో పాటు మరో ఐదుగురికి శాశ్వత సభ్యతాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదును రెండు నెలల్లోపు పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్నమరివీడు గ్రామంలో ఆయన పర్యటించారు. జలజీవన్ మిషన్ రూ. 58లక్షల నిధులతో నిర్మించే తాగునీటి పథకానికి భూమి పూజ చేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీర్చేందుకు గాను జలజీవన్ మిషన్ పథకం కింద పనుల శరవేగంగా జరుగుతాయని ప్రతి ఇంటి ఉచిత కొళాయి ఇస్తున్నామన్నారు. రెండో విడతలో వచ్చే నిధులతో చిన్నమరివీడు గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, షేక్షావలి, నూర్‌అహ్మద్, రంగస్వామినాయుడు, వినోద్ గౌడ్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, చిన్ననేలటూరు నాగన్న, ఎర్రబాడు శ్రీనివాసులు, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో టీడీపీ సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ, మంత్రాలయంలో రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే నాయకులకు, కార్యకర్తలకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మంత్రాలయంలో టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్‌స్వామి ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డి, చిలకలడోనలో ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి వేర్వేరు సమయాల్లో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయరామిరెడ్డి, ఎల్లారెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, నవకోటి నారాయణ, సుజ్ఞానం, అండే హనుమంతు, తిక్కస్వామిగౌడు, నరసింహులు, సోల్మాన్ రాజు, తిక్కయ్య, హనుమంతు పాల్గొన్నారు.

కోసిగి: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత బలం అని మంత్రాలయం పార్టీ యువ నాయకుడు ఎన్. రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం కోసిగి మండల పరిధి లోని కోల్‌మాన్‌పేట, దుద్ది గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షతన టీడీపీ మండల ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, నాయకులు నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, చిన్న తాయన్న, మాజీ జడ్పీటీసీలు తోవి రామకృష్ణ, వెంకటేశ్, మదిరి వీరారెడ్డి, పెద్ద రామయ్య, గాలెం వీరేష్, సాతనూరు కోసిగయ్య, గుడిసె రామాంజనేయులు, పోతుల వీరారెడ్డి, వీరయ్య, గౌస్, సొట్టయ్య, గడ్డం గోపాల్, రంగారెడ్డి, ఈరేష్, రామిరెడ్డి, నాగరాజు, లక్ష్మిరెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేయించుకోవాలని టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. శనివారం పెద్దకడబూరులోని సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజినేయులు, వీరేష్ గౌడ్, నరసింహా రెడ్డి, యంజీ నరసన్న, చంద్ర, రామలింగ పాల్గొన్నారు.


పెద్దకడబూరులో..


కోసిగి మండలం కోల్‌మాన్‌పేటలో..

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

ఎమ్మిగనూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే బీవీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులు తమ పశువుల వివరాలను పశుసంవర్ధక శాఖ అధికారుల దగ్గర నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సుబ్రమణ్యమచారి, సిబ్బంది, టీడీపీ నాయకులు ధర్మాపురం గోపాల్, కాశీంవలి, కేటీ వెంకటేశ్వర్లు, నరసన్నగౌడు, శంకర్‌గౌడు, జగదీష్ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

మంత్రాలయం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహల్లి గ్రామ సమీపంలో రైతులకు సాగునీరు అందించే 25హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి రాగి, అల్యూమినియం తీగలను అపహరించారు. శనివారం ఈ విషయాన్ని గమనించిన రైతులు రామాంజనేయులు, రామలింగప్ప, వెంకటేశ్ రామ్మూర్తి లు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగి ఉంటుందని రైతులు అనుమానిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి నీరు లేక మిరప, పత్తి, బంతి పూలు ఎండిపోతున్నాయని రైతులు వడ్ల వెంకటేశ్, రామాంజనేయులు వాపోయారు. చోరీ ఘటనను పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మంత్రాలయం ఎస్ఐ పరమేశ్ నాయక్‌ను తెలిపారు.

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, అక్టోబరు 26 (ఆంధ్రజోతి): వేదపండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావానికి బంగారు కవచం సమర్పణ సేవ వైభవంగా నిర్వహించారు. శనివారం కార్తీక దశమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు, అర్చకులు బృందావానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. పీఠాధిపతి హస్తోధకం చేసి మహామంగళహారతులు ఇచ్చారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు:

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కిక్కిసిరింది. కార్తీక శనివారం కావటంతో సాయంత్రం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో మరింత రద్దీ పెరగనుంది. శనివారం మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహాలంగా మారింది.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి అన్నారు. శనివారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు విజ్ఞాన యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యాత్రలో జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్ గాజులదిన్నె, కడివెళ్ల, రవీంద్ర విద్యానికేతన్, కర్నూలు, డీఎస్ఎం ప్రభుత్వ బాలికల హైస్కూల్, పెద్దపాడు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల దిన్నెదేవరపాడు, ఆరేకల్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రానికి వచ్చిన విద్యార్థులకు డాక్టర్ రాఘవేంద్రచౌదరి కృషి విజ్ఞాన కేంద్రం విధి విధానాల గురించి వివరించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడంలో కేవీకే పాత్ర వివరించారు. బీఎస్సీ వ్యవసాయ విద్యలో చేరాలనుకేనే విద్యార్థులు ఇంటర్‌లో బైపీసీ కోర్సు తీసుకొని ఈఏపీసెట్, ఐసీఏఆర్ ప్రవేశ పరీక్ష రాసి వ్యవసాయ విద్యను అభిసించి ఉపాధి పొందవచ్చని తెలిపారు. కేవీకేలోని డెమో యూనిట్ల వేరుశనగ, వరి, పత్తి, క్యాటిల్, షిప్, పౌల్ట్రీ, అజొల్లా, పశుగ్రాస, హార్టికల్చర్ హార్బెడ్స్, వర్మికంపోస్టు, షెడ్‌నెట్, ల్యాబ్, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్, టమోటా ప్రాసెస్సింగ్ యూనిట్, సాయిల్ టెస్టింగ్, తావావరణ కేంద్రాలను కేవీకే సిబ్బంది విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో చందన, నిరంజన్‌రెడ్డి, మౌనిక, సుమంత్‌రెడ్డి, తేజకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, రవీంద్ర, ఏవో మధుమవతి, చక్రవర్తి నాయక్‌లు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి

రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం: సబ్ కలెక్టర్

నందవరం, అక్టోబరు 26(ఆంధజ్యోతి) గ్రామాల్లోని రైతు సమస్యలని పరిష్కరిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరత్‌వాజ్ అన్నారు. శనివారం మండలంలోని ధర్మాపురం గ్రామంలో ఆర్ఐ జర్మియా ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రైతుల నుంచి వచ్చిన సమస్యలు వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సమావేశంలో తహసీల్ధారు శ్రీనివాసులు, డీటీ మహేష్, సర్వేయర్లు అక్బర్‌బాషా, ముగతి శేఖర్, వీఆర్వో నతానీయేలు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో శనివారం తహసీల్దార్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. పలువురి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, వీఆర్వోలు మహదేవప్ప, విరుపాక్షి, శివానంద, మండల సర్వేయర్ బసవరాజు స్వామి, సర్వేయర్లు ఉన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో శనివారం తహసీల్దార్ శేషఫణి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. దాదాపు 50 మంది రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, వీఆర్వోలు పాల్గొన్నారు.


అర్జీలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

348 ఫిర్యాదులు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన రెవెన్యూ గ్రామ సభల్లో ఇప్పటి వరకు 348 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బనవాసి, దేవిబెట్ట, ఏనుగుబాల, గార్లదిన్నె, మల్కాపురం, తిమ్మాపురం గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహించామన్నారు. మిగతా గ్రామ పంచా యతీల్లో కూడా రెవెన్యూ సభలు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు

పౌష్టికాహారం అందించాలి

గోనెగండ్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తహసీల్దార్ కుమారస్వామి సూచించారు. శనివారం మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. భోజనం ఉడికిందా లేదా అని రుచిచూశారు. మెనూ పాటించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

నందవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలదిన్నె జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కాశీం అనే విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైయ్యారు. 68వ రాష్ట్ర స్థాయి అండర్ -17 బాలుర విభాగంలో ప్రతిభ చూపారు. ఈ నెల 27,28,29 తేదిలలో అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. శనివారం ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

చేపల చెరువు వేలం వాయిదా


మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి నాగరాజు

కోసిగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోసిగి, పెద్దకడుబూరు మండలాల మధ్యలో ఉన్న పులికనుమ ప్రాజెక్టు చేపల చెరువు వేలం శనివారం రెండోసారి వాయిదా వేసినట్లు మత్స్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. నాలుగు నెలల క్రితం చేపలచెరువు వేలంపాటలో ఇరువర్గాల వాదోపవాదలు జరగగా అప్పట్లో వాయిదా పడింది. శనివారం వేలందారులు ఏడాదికాలానికి చేపలచెరువు వేలం నిర్వహించాలని, లేదా సర్కారువారి నగదు తక్కువ చేయాలని పట్టుబట్టడంతో మత్స్యశాఖ అధికారి శనివారం మళ్లీ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మత్స్య శాఖ అధికారుల ఆదేశాలతో మరోసారి వేలంపాటలు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం ముందు ఎస్ఐ పి.చంద్రమోహన్ గట్టి బందోబస్తు నిర్విహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ ఈరన్న వేలంపాటాదారులు పాల్గొన్నారు.